కాంక్ష

'స్స్... అంటూ రయ్యన గాలి చెవుల గూబల్లో మార్మోగుతోంది.

నేలమట్టమయిన కోట ఆనవాళ్ళు...

విస్తారమైన చిన్నా పెద్దా గట్ల నడుమ మెట్ట చేలు... గట్ల మీద రాళ్లూరప్పలు కలిసిన మట్టిలోంచి తలెత్తిన పిచ్చిమొక్కలూ, పచ్చటి, ఎండిన తీగలూ గాలికి ఊగిపోతున్నాయి. గురివింద చెట్ల నుంచి, గురివింద గింజలు రాలిపడుతున్నాయి. కలబంద... నాగమల్లె పండ్లు మాగి, ఎఱ్ఱగా... నల్లేరు తీగెలు... సజ్జ చేలల్లో అక్కడక్కడ రాలి, ఉండిపోయిన వగుడాకులు ఎగిరెగిరి పైకి లేస్తూ కిందికి వాలిపోతున్నాయి - మళ్లీ ఎగురుతూ, పైకిలేస్తూ, గిరికీలు కొడుతూ. చెనక్కాయ చాళ్లల్లో పూడుకుపోయిన కాయల్ని, ముట్టెల్తో నల్లజీవాలు పెళ్లగించి తింటున్నాయి. దొమ్మరకొండ మీదుగా వస్తున్న పక్షులు ఆకాశమార్గంలో గాలిలో దూసుకపోతున్నాయి.

కోట చేను. చేలో మర్లించిన గొర్లు 'బ్యా బ్యా' అంటూ గుంపుగా కదులుతున్నాయి. ఒకదాన్నొకటి రాసుకుంటూ, తోసుకుంటూ మంద ముందుకు నెమ్మదిగా పోతోంది. గొర్లు పెంటికలు పెడుతున్నాయి, ఉచ్చలు పోస్తున్నాయి- వేయబోయే పంట సత్తువ కోసం.

"వస్తా", విన్పించీ, సరిగా విన్పించని ఏదో శ్రుతి.

"నేనొస్తా", ఒకటిన్నర శ్రుతి. వెనక్కి తిరిగి చూస్తున్నాడు. ఏమీ లేదు. గాలి మాట. నవ్వుకుంటున్నాడు.

"ఒచ్చేస్తున్నా", రెండున్నర శ్రుతి. మళ్లీ తల తిప్పి వెనక్కి చూస్తున్నాడు. ఎవరూ లేరు. కొంచెం భయం.

"ఒచ్చేసేదా? చూడు..." ఆరో శ్రుతి పిలుపు.

ఒళ్లు జలదరింపు... జడుపు. వెనక్కి చూసే ధైర్యం లేదు.

వడివడిగా పరుగు నడక... పిరికి నడక...

"ఓయ్ అల్లుడా!" గాలి కలిసిన పిలుపు.

గుండె కొట్టుకుంటోంది...

"ఓయ్ అల్లుడా! ఆగోయ్ వస్తున్నా"

గుండె చిక్కబట్టుకొని, పక్కలకు చూస్తున్నాడు.

పందుల గంగిరెడ్డి, తన నల్లజీవాల్ని తోలుకుంటూ వస్తున్నాడు – ఆ పందుల మాదిరే నల్లగా, బలిసి, ధృఢంగా గుర్‌గుర్ గొంతుతో. కోట చేనుగట్టును ఆనుకొని పెరిగిన ముచ్చుమర్రి వైపు నుంచి వస్తున్నాడు.

"అమ్మయ్య!"

తను ఒగరుస్తున్నాడు.

"పిలుపులన్నీ పందుల మామవా?"

"మామా! నువ్వా"

"ఏందోయ్! ఆ పరిగెత్తినట్లు నడవడం – కుక్కలు తరిమితే నా పందులు పరిగెత్తినట్టు. ఓరి నాయాలా!"

పందులతో పోల్చినందుకు తనకు కోపం వస్తోంది. నిక్కర్లు తొడుక్కుంటేనేం తను తొమ్మిదో క్లాసు.

గుర్ గుర్ గుర్ అంటూ పందులు మోరలెత్తి తన వైపు చూస్తున్నాయి. పరాచికంగా తనంటున్నాడు: "ఈ పందుల భాషను మానతావా మానవా మామా?"

పందుల గంగిరెడ్డి అంటున్నాడు – పందుల వైపు మురిపెంగా చూస్తూ:

"నా జీవనం ఇవేనోయ్ అల్లుడా. నా మాటా, పలుకూ నల్లజీవాల్దే. తప్పా? ఎంగిలిపీసు సదుగుతున్నావు, నీకేం తెలుసు పందులంటే? వాటి మాంసం మెక్కడం తెలుసు– నేను కోసినప్పుడు, మీ నాయన ఇంటికి తెచ్చినప్పుడు."

నల్లజీవాల్ని అదిలిస్తూ, తోలుకుంటూ పందుల గంగిరెడ్డి ఊరి బాట వైపు కదులుతున్నాడు.

తను అడుగుతున్నాడు:

"మామా, మామా! నువ్వేమన్నా ఇంతకు ముందు పిల్చినావా?"

"పిల్చినా, పలికినావు, ఏం?"

"అదికాదు, 'వస్తా, నేవస్తున్నా, ఒచ్చేస్తున్నా, ఒచ్చేసేదా' అనేమన్నా..."

పందుల గంగిరెడ్డి పగలబడి నవ్వుతున్నాడు. పందిలాగా గుర్‌గుర్ అని నవ్వుతూ అంటున్నాడు:

"ఈ కతలన్ని నాకు తెల్దు. నేను పిల్చింది పిల్చినా, ఈ గాలిలో నీకు ఏమని యిన్పించిందో! గొర్లమంద ఉందే చూడోయ్... ఆడ... గొర్ల బయన్న ఉండాడు. నేనిప్పుడే పలకరించి వచ్చినాలే. ఆ ముసలోణ్ణి అడుగు. గొల్ల సుద్దులు తెలుసు. మాల సుద్దులు తెలుసు. తురక సుద్దులు తెలుసు. ఉండు. ఇంటికి పోతానే ఈ సుక్కపందిని కొయ్యాలె.... ఇల్లిల్లూ ఆరడరిచ్చింది... వస్తా... వస్తా."

గాలిలో దూసుకుంటూ పోయి, తాను కోట చేలో ఉన్నాడు.

గొర్ల మందకు కొంత దూరంగా, గొర్ల గూడు దగ్గర బయన్న తాత మోకాళ్ల మీద గొంతు కూర్చొని ఉన్నాడు. ఒక గొర్రె పిల్లను నిమురుతున్నాడు. తలెత్తి తనను అడుగుతున్నాడు:

"ఏంది మనవడా! అట్లా వగరుస్తూ వస్తుండావు - తోడేలు వెంటబడితే గొర్రెపిల్ల వణికిపోతూ పరుగులు తీసినట్లు."

గొర్రెలు బ్యా బ్యా బ్యా... అరుస్తున్నాయి. కొన్ని చీదుతున్నాయి.

తను బయన్న పక్కన కూర్చున్నాడు.

"బయన్నా తాతా! ఒకటి అడుగుతా చెప్తావా?"

నిమురుతున్న గొర్రెపిల్లను బయన్న తాత ముందుకు తోస్తున్నాడు. అది నెమ్మదిగా మంద వైపు గెంతుకుంటూ పోతోంది.

బయన్న తాత "ఉ" అంటున్నాడు.

"నువ్వెప్పుడన్నా ఈ చేలల్లో వెనక నుంచి ఏమన్నా మాటలు విన్నావా?"

"ఏ మనిషిన్నా పిల్చినప్పుడు..."

"అది కాదు తాతా! మనిషి కనపడకుండా మాట విన్నావా?"

"ఏ మాట?"

"వస్తా, నేనొస్తా, ఒచ్చేస్తున్నా, ఒచ్చేసేదా?"

బయన్న తాత ముసి ముసి నవ్వులు నవ్వుతున్నాడు, బోసి నోటితో...

"ఓర్నీ పాసుగులా! నీకేదో సుడి ఉంది... ఈ మాటలు విన్నామని చెప్పినోళ్లు మనూళ్లో ముగ్గురుండే వాళ్లు. చచ్చిపోయినారనుకో. వాళ్లల్లో మా ముత్తాత ఒకడు. మీ ముత్తాత ఒకడు. దొమ్మర నారాయు డొకడు. ఆ పాత కతంటావా? పింగళనామ సంవత్సరంలో కోటను ఏలినాడే ఆ పాలెగాడు - కోట నవాబుగాడు - పూడ్చి పెట్టిపోయిన నిధి పిలుపంట అది! నేను విన్లేదు. చూల్లేదు. ఎన్ని పగళ్లో, ఎన్ని రాత్రుల్లో చేలల్లో గొర్లు మర్లించినాం. గొర్ల బాసలు విన్నా... ఆ ధన పిశాచం బాస నాకేం ఎరుక? మీ చినతాత చిన వేమారెడ్డి విన్నాడని ఎవరో అన్నారు. ఆయప్ప చూపంతా నిధులెక్కడ దొరుకుతాయో అనే కదా! అయినా మనుమడా! ఆ బాస మగ బాసా? ఆడ బాసా?"

"మొన్న మనూళ్లో వేసిన నాటకంలో ఒకటిన్నర, రెండున్నర, ఆరు అని హార్మోనియం లక్ష్మిరెడ్డి అంటా ఉంటే పాడినారే... అదేందీ ఆ శ్రుతిలో..."

"సూదు... అది ఏ బాస అన్నాగానీ... ఎవరితోనూ అనొద్దు. అన్నావా? పనులు చెడగొట్టుకొని మనూళ్లో తిరిగేవాళ్లున్నారు. ఛెంపర్లాడుతూ. ఏ అఘాయిత్యమైనా చేస్తారు. బలీ గిలీ అంటూ. మర్చిపో... మర్చిపో... ఇంటికి పా... మన వెఱ్రి వేమన్న పద్దెం గుర్తుంచుకో.

"ఇంటిలోని ధనము ఇది నాది అనుచును
మంటిలోన దాచు మంకు జీవి
కొండబోదు, వెంట గుల్ల కాసును రాదు
విశ్వదాభిరామ వినుర వేమ"

– బయన్న తాత రాగం తీస్తున్నాడు.

చేలో రూపాయలు, రూపాయలు ఎక్కడబడితే అక్కడ. తను జేబుల్లో నింపుకుంటున్నాడు. స్కూల్లో బ్యాగులోని పుస్తకాలు పారేసి, ఆశగా బ్యాగు నింపుకుంటున్నాడు. ఎన్నెన్ని రూపాయలు... ఎక్కడంటే అక్కడ!...

పాము... అమ్మో సరసరా పాకుతూ వస్తోంది... పడగెత్తింది.

❀ ❀ ❀

"నారపరెడ్డి సార్! రాష్ట్రంలో మీకెంత పేరొచ్చిందో!" ఉపాధ్యాయ ఉద్యమం మీలాంటి వాళ్లుండడం వల్లే ముందుకు పోతోంది. మీది ఉడుం పట్టు" – ఎవరో అంటున్నారు. అభినందిస్తున్నారు.

అరే పేపరులో తన పేరు ఆదర్శ ఉపాధ్యాయుడుగా, నిజాయితీ ఉద్యమ శీలిగా...

తన ఫోటో...

తన ఉపన్యాసం కూడా...

నిరసనలు, నినాదాలు, ధర్నాలు, నిరాహారదీక్షలు – అన్నిట్లోనూ తాను.

పంచెకట్టులో, చేతులు పైకి మడత పెట్టిన తెల్లటి చొక్కాలో... కళ్లద్దాలతో...

ఖాళీ టీచరు పోస్టులు భర్తీ చేయాలి.

అక్రమ బదిలీలు ఆపాలి...

విద్యాకమిటీలు పెద్ద బూటకం.

విద్యావాలంటీర్ల వెట్టిచాకిరి – ఒక నాటకం.

ఉపాధ్యాయ ఐక్యపోరాటం – వర్ధిల్లాలి.'

❀ ❀ ❀

నారపరెడ్డి నిన్న మొన్నటి దాకా భావిసమాజాన్ని గురించి కలలు కన్నాడు. బంధువు లందరూ అప్రయోజకుడనీ, తిరుగుబోతనీ బిరుదులిచ్చారు. మంచి టీచరని పేరొస్తే మాత్రం ఏం మిగిలిచ్చిచచ్చాడని తిట్టారు. ఆ బాణీ ఇటీవల మారుతూ వచ్చింది. ఏ వెన్నుపూసా విరక్కుండా, నారపరెడ్డి ఇద్దరమ్మాయిలకు పెళ్ళి చేశాడు. ఇద్దరు కొడుకులు ప్రయోజకులయ్యారు. 'నారపరెడ్డి ఏమైనా అదృష్టవంతుడు' అని బంధువులు కొత్త బిరుదు తగిలించారు.

ఈ నాలుగు పనుల్నీ చక్కబెట్టడంలో నారపరెడ్డి నిర్వాకం చాలా తక్కువే. స్వగ్రామంలోని పిత్రార్జితం పదెకరాలు అమ్మాడు. వచ్చిన రెండు లక్షల్లో తన ఉద్యమజీవితానికెంత ఖర్చయిందో పిల్లల పెంపకానికీ, చదువులకూ ఎంత ఖర్చయిందో నారపరెడ్డి కంటే నారపరెడ్డి భార్యకే బాగా తెలుసు. తన చదువును తలిదండ్రులు పదో క్లాసులో ఆపినప్పుడు ఆమె ఆ వయసులో ఎంతో బాధ పడింది. చదువంటే ఉండే గౌరవం వల్ల, పట్టుదలగా, ఓర్పుగా, నేర్పుగా తన పిల్లలు ఆడా మగా తేడా లేకుండా చదువుల్లో రాణించేట్లు కృషి చేసింది.

పెద్దమ్మాయి ఎం.ఎస్సి., గణితం చేసింది. మరో గణితం, ఎం.ఎస్సి.ని పెళ్ళి చేసుకుంది. కట్నగణనాల్లేవు. రెండో అబ్బాయి బి.టెక్ మెకానికల్ చేశాడు. నానా తంటాలుపడి కంప్యూటరు కోర్సులు పూర్తి చేశాడు. అమెరికాలోని సమాచార సాంకేతిక పరిశ్రమ పిలుపుతో అమెరికా చేరుకున్నాడు – హెచ్1బి మీద, 60Kతో మూడో అమ్మాయి గ్రూప్ ఒక సర్వీసులో సిటిఓగా సెలక్ట్ అయింది. ట్రయినింగులో చేరిందో లేదో, మరో గ్రూప్ ఒన్ ఆర్‌డిఓ జాతివాడు పెట్టు పోతలు ఆశించకుండా పెళ్ళి చేసుకున్నాడు. నాలుగో అబ్బాయి ఎం.ఎస్సి., మైక్రోబయాలజీ చేసి ఒక పెద్ద ఫార్మాస్యూటికల్ కంపెనీలో ఇటీవల ఉద్యోగంలో చేరాడు. ఇందువల్లనే నారపరెడ్డిని బంధువులందరూ అదృష్టవంతుడని పొగడడం. ఆ పొగడ్డం కూడా నారపరెడ్డి భార్య ఎదురుగ్గా పొగిడేవాళ్లు–ఆమె పాతివ్రత్యం సంతోషిస్తుందని. ఆమె నవ్వి ఊరుకునేది.

మగపిల్లలిద్దరూ తమ పెళ్ళి సమస్యల్ని తామే పరిష్కరించుకున్నప్పుడు నారపరెడ్డి గంభీరంగా ఉన్నాడు. భార్య మాత్రం ముభావంగా ఉండిపోయింది. అమెరికా కొడుకుతో చిక్కులేకపోయింది. సహఉద్యోగి గుడివాడ అమ్మాయిని చేసుకున్నాడు – కుల తూకం సరిచూసుకొని. ఆ దంపతులెట్లాగూ తరచుగా రారు. ఇండియా కొడుకుతోనే నారపరెడ్డి చీకాకుపడ్డాడు. కొంత క్షోభకు గురి అయ్యాడు. ఇండియా కొడుకు పెళ్ళాడిన అమ్మాయి కులమింటి కోతే. అయినా పసిడిగల వాని కూతురు. చాలా సహజంగా రాకపోకలు రద్దయ్యాయి.

నారపరెడ్డి అహానికి తగలరాని దెబ్బే తగిలింది. ఉపాధ్యాయ ఉద్యమంలో తన పేరు, వియ్యంకుడి కలిమి ముందు కొరగాకుండా పోయింది. రాత్రి సమయాల్లో వచ్చే ఒకేరకం కలల కలత వల్ల నిద్ర కూడా సరిగా పోయేవాడు కాదు. నలుగురికీ పనికి వచ్చే ఏదో మంచి చేయాలనే ఉత్సాహం నీరుగారి పోయింది. సదసత్సంశయంలో కూరుకపోయాడు.

ఆ మధ్య ఒక రోజు యూనియన్ సహచరుడూ, చిరకాలమిత్రుడూ రామారావు ఇంటికి వచ్చాడు. ఆ రాత్రి పడుకునే ముందు ఆత్మవిచార ప్రసంగం చేశాడు:

"చూడోయ్ నారపా! నేనిటీవల ఒక నిర్ణయానికి వచ్చేశా. ఎన్నాళ్ళని ఈ కంచి గరుడసేవ? ఈ కప్పల తక్కెడ యూనియన్ రాజకీయాలు? మీ చెల్లెలు అదే నా భార్య వైపు బంధువు ఒకరు హైదరాబాద్‌లో పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారి. కరోర్‌పతి. మామూలుగా కాదు కొన్ని కోట్లకు మగడు. మనం కూడా అలాంటి

వాళ్ళను పట్టుకొని ఏదో చేసుకోవాలి. ఈ రోజుల్లో మన పిల్లలు మన పిల్లలు కారు. మనమై మనం ఇంకాస్త సుఖంగా బతకడం కోసం న్యాయమైన పనులే చేద్దాం. ఇళ్ళ స్థలాల మీద మనం పెట్టుబడి పెడతాం. అది పెరుగుతుంది. మా బావమరిది హైటెక్ సిటీ చుట్టుపక్కల ఎక్కడో ఎప్పుడో రెండు లక్షలు పెట్టి స్థలం కొన్నాడు. ఇప్పుడది అరవై లక్షలు పైగా పలుకుతోంది. మా రేపల్లెలో మిగిలిన ఆ ఒక్క ఎకరా భూమీ అమ్ముతున్నాను - హైదరాబాద్‌లో స్థలం కొనాలని... వీలుంటే కలిసి చేద్దాం... ఏ పనైనా..."

నారపరెడ్డి సావధానంగా విన్నాడు. నారపరెడ్డి మీద రామారావు ఆత్మ విచార ప్రసంగ ప్రభావం మరుసటి నెలలో కనిపించింది. ఈ మధ్యకాలంలో నారపరెడ్డి కళ్ళ ముందు లక్షలు మయూర నృత్యం చేశాయి. ఊళ్లో మిగిలిన ఆరెకరాల భూమినీ అమ్మాలని తీర్మానించుకున్నాడు. మాటవరుసకన్నట్లు భార్యతో ప్రస్తావించాడు - "అమ్మమంటావా?" అనే ఒకే ఒక్క ప్రశ్నతో.

"మనకిప్పుడేం తక్కువ?" అంది ఆ ఇల్లాలు.

"మన చిన్నోడి అత్తామామలకు అంత పొగురుంది కదా - డబ్బూ దస్కం ఉందని, మోసేటంత బంగారముందని, పెద్ద ఇల్లుందని, కారుందని?..."

"ఉంటే?"

"చిన్నచూపు చూస్తున్నారు"

"ఎవర్ని గురించైనా, ఇన్నేళ్ళ కాపురంలో ఎప్పుడూ ఇట్లా అనలేదే!"

నారపరెడ్డి తడబడ్డాడు. తన సంస్కారానికి చిల్లి పడిందని మాత్రం గ్రహించాడు. అయినా నిశ్చయాన్ని మార్చుకోలేదు. ఊరికి వెళ్లాడు. చిన్నబ్బ చినవేమారెడ్డి చిన్న కొడుకు తనే కొంటానన్నాడు. నారపరెడ్డి తన దాయాదికి అమ్మి, పూర్వీకుల ఆస్తితో తెగతెంపులు చేసుకున్నాడు.

ఇళ్ళ స్థలాల మీద నారపరెడ్డి పెట్టుబడి పెట్టడం మొదలైంది. హైదరాబాదులో చౌకలో రెండు స్థలాలు. కదిరిలో ఒకటి, అనంతపురంలో ఒకటి... కొనుగోళ్ళు, అమ్మకాలు, కొనుగోళ్ళు, అమ్మకాలు మొదట్లో ఆత్మవిచార మిత్రుడి సలహాలూ, సంప్రదింపులతో జరిగాయి. కాసులు చేరాయి. ఫైనాన్స్ కంపెనీలో పెట్టుబడి మొదలైంది. అనుభవం పుట్టింది.

భూకబ్జాల, బినామీల, ఆకట్టుకొన్ని, పని జరుపుకోడాల, అధికారం బ్రోకర్ల ప్రపంచంతో సంబంధాలు గట్టిపడ్డాయి. మందు తాగిన మైకంలో నారపరెడ్డి అంతరాత్మ అప్పుడప్పుడూ బుడి బుడి ఏడ్పులు ఏడ్చింది. లోకన్యాయం అంటూ దాన్ని జోకొట్టాడు. కారు కొన్నాడు. జూనియర్ కాలేజికి పర్మిషన్ తెచ్చుకున్నాడు. చిన్న కొడుకు అత్తామామలూ, వాళ్ళ వైపు బంధువులూ ఎందుకైనా మంచిదని నారపరెడ్డిని పూసుకుని తిరగసాగారు. చిన్నల్లుడు 'సంపద ఇట్లా పెంచుకుంటే మంచిద'ని, సలహాలిస్తూ, మామకు బాసటగా నిలిచాడు. బంధువుల రాకపోకలూ, పొగడ్తలూ సరే సరి.

ఒకప్పటి నిజసహచరులు మాత్రం దూరంగా ఉండిపోయారు. ఇంకా దూరంగా జరిగారు. భర్త ప్రపంచంలోకి ఏనాడూ కూడా పూర్తిగా మనసు పెట్టి తొంగిచూడని నారపరెడ్డి భార్య, కన్నపిల్లల మమకారాల్లో వచ్చిన మార్పుల్ని - కొత్త కొత్త రకాల వాటిని - చూసి భరించలేకపోయింది. అపేక్షలు లేని ఆస్తుల డొల్లతనం అనుకుంది.

ఊరి వార్త నారపరెడ్డిని ఉక్కిరిబిక్కిరి చేసింది. హైదరాబాద్‌లో లావాదేవీల్లో ఉన్నప్పుడు ప్రముఖ పత్రికలో వచ్చిన వార్త చూసి ముందు ఏదో చేజారిపోయినట్లు గింజుకున్నాడు.

మూడు కాలాల్లో ప్రముఖంగా బాక్సు కట్టి రెండో పేజీలో ప్రచురించిన ఆ వార్తను హెడింగ్, లీడ్, డేట్‌లైన్‌లతో సహా నారపరెడ్డి మళ్ళీ మళ్ళీ చదివాడు:

నవాబు నిధి కోసం నరుకుడు

పరారీలో పాలెగాడు

నవాబుకోట, మే 7 : పవిత్ర బుద్ధ జయంతి. అహింసను హింస జయించింది. పట్టపగలు ఉదయం పొద ఎండ. దక్షిణానిలం మంద్రంగా వీస్తోంది. కోట చేనుగట్టు దగ్గరి ముచ్చుమర్రి. కింద గొర్ల బయన్న. మనుమడు మేకల గంగన్న చద్దిమూట విప్పుతున్నాడు.

స్థానిక వదంతుల ప్రకారం మేకల గంగన్న అశరీరవాణి వాక్కులు విన్నాడు 'వస్తా, నేనొస్తా, ఒచ్చేస్తున్నా, ఒచ్చేసేదా?' అని. ఆయన భయంతో వణికిపోయాడు. జిల్లా ఉపాధ్యాయ ఉద్యమనేత నారపరెడ్డి తన జ్ఞాతికి అమ్మిన పొలంలోకి పరుగులు తీశాడు. తన పొలంలోకి ఎరువు బండితో నారపరెడ్డి జ్ఞాతి బాలవేమారెడ్డి వచ్చాడు. నొగలు పైకెత్తి ఎరువంతా కుప్పపోశాడు. నొగలు దించి ఎద్దులకు పట్టెడలు బిగించాడు. బాలవేమారెడ్డికి మేకల గంగన్న జరిగింది చెప్పాడు. 'నాకింకా విన్పిస్తాంది. నీకు విన్పించలేదా?' అని గజగజలాడిపోతూ బాలవేమారెడ్డిని అడిగాడు. తనకేమీ విన్పించలేదని చెప్పాడు. బాలవేమారెడ్డికి వారసత్వంగా విన్నది స్మృతికి వచ్చింది. మేకల గంగన్న చెవిలో రహస్యంగా మంత్రం వేశాడు. మేకల గంగన్న "రావద్దు పో" అని అరిచాడు. అంతే... క్షణాల్లో భూమి చీల్చుకొని నిధి బయటకు వచ్చింది. మేకల బయన్నకు కళ్లు బైర్లుకమ్మాయి. బాలవేమారెడ్డికి కళ్ళు విచ్చుకున్నాయి. అంతే... బాలవేమారెడ్డి ఎరువు జల్లలో నుంచీ వేట కొడవలి తీశాడు. గంగన్నను ఒక్క వేటుతో నరికాడు. నిధిని బండిలో వేసుకున్నాడు. లక్షలకు లక్షలు వెండి, బంగారం ఉండవచ్చునని కథనం. ఒక ప్రత్యక్ష సాక్షి బాలవేమారెడ్డి బంధువు పందుల గంగిరెడ్డి దూరం నుంచీ చూసినట్లు చెబుతున్నారు. పందుల గంగిరెడ్డి చింతామణికి వెళ్ళిపోవడం వల్ల వివరాలు తెలియడం లేదు.

హత్య జరిగి, పంచనామా జరిగి, శవ ఖననం చేసిన తర్వాత కొన్ని గంటలకు పోలీసులకు సమాచారం అందింది. రంగంలో పోలీసులు ప్రవేశించారు. నిధి దొరకలేదు. అరెస్టు జరగలేదు. హత్య జరిగిన రోజు బాలవేమారెడ్డి అనంతపురంలో స్థానిక అధికారపక్ష నాయకుడి ఇంట్లో వున్నట్లు పోలీసుల కథనం.

ఇటువంటి ఉదంతాలు ఈ ప్రాంతంలో ఎన్నో వార్తలకు ఎక్కినా, పురాతత్త్వశాఖ ఇంతకాలం పట్టించుకోలేదు. నిధుల కొరత కారణంగా తవ్వకాలు చేపట్టలేమని పురాతత్త్వశాఖ అధికారి ఒకరు తమ అశక్తతను వెలిబుచ్చారు.

– వార్తలో తన ప్రస్తావన వచ్చినందుకు సంతోషించాలో, బాధపడాలో నారపరెడ్డికి దిక్కుతోచలేదు. వార్త నిజమై ఉండవచ్చు. దాయాది బాలవేమారెడ్డి తన సాయం కోసం వెంపర్లాడకపోడు. హైదరాబాద్‌లో నలుగురైదుగురు ముఖ్యులు గుచ్చి గుచ్చి అడిగినప్పుడు నారపరెడ్డి మనసు చెదిరిపోయింది. ఆ రాత్రి మోతాదుకు మించి తాగి కలత నిద్రలోకి జారుకున్నాడు.

ఏ అపరాత్రో...

...

'ఒకటో అడుగు, రెండో అడుగు, మూడు అడుగు, నాలుగు... అయిదు...

తప్పెట్లు లయాత్మకంగా ధ్వనిస్తున్నాయి.

కొమ్ము ఊదుడు...

బలిసిన కురబ పొట్టేలు...

ఎవరో పట్టుకున్న నెమలి ఫింఛం కట్ట...

గుర్రం మీద ఎక్కి, ఖడ్గం తిప్పుతూ, తప్పెట లయకు అనుగుణంగా కదనుదొక్కిస్తున్న బాల వేమారెడ్డి...

పసుపు తలపాగా చుట్టి, పసుపు బట్టల్లో...

కోట చేను...

ముచ్చుమర్రి...

వడిగాలి...

తన చిన్ననాటి సావాసగాడు, – తన కిష్టమైన కథల తాత గొర్ల బయన్న మనుమడు – మేకల గంగన్న గొంతు తెగి పడింది. తెగి పడిన గొంతు తలాడిస్తూ అరిచింది:

"వీణ్ణి ఏం చేయాలప్పా?"

"చట్టం, న్యాయం, సంస్కారం ఏమీ చెయ్యలేనప్పుడు నువ్వేం చేస్తావు?" అని తాను అంటున్నాడు.

"నరుకుతా"

"అందరూ నరికేవాళ్లే... వేమారెడ్లు... నక్సలైట్లు... పోలీసులు... ఒకర్నొకరు నరుక్కోండి, సరిపోతుంది" – తాను అరుస్తున్నాడు.

"నువ్వూ నరికేవాళ్ళవైపేలే," మేకల గంగన్న నోరు మూగపోయింది.

గొర్ల బయన్న కమ్మగా పద్యం పాడుతున్నాడు.

"ఆశ చేత మనుజు లాయువుగలనాళ్లు
తిరుగు చుంద్రు భ్రమలు తిప్పలేక
మురికి భాండమందు ముసరు ఈగల వలె
విశ్వదాభిరామ వినుర వేమ!"

శ్రుతి మారుతూ పోతోంది.

ఏదో మాట, ఏవో మాటలు, ఏవేవో తెగిన కంఠాల ధ్వనులు...

"వస్తా"

"నేనొస్తా"

"ఒచ్చేసేదా?"

"వద్దు... వద్దు... రావద్దు తండ్రీ, రావద్దు తల్లీ", నారపరెడ్డి ఆ రాత్రి పూర్తిగా మత్తు వదలని కలత నిద్రలో కలవరిస్తూనే...

హోటల్ మెత్తటి పరుపు మీద కుడి ఎడమల పొర్లుతూ...

● రచన, జూలై 2001

- కథామహల్, 2002. ●